

కామన్ మెనూ అమలు చేయలేం..



- ప్రస్తుత ధరలతో సాధ్యం కాదు..
- ఇబ్బందుల్లో సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు
- కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేత

గణేశ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం ఇటీవల ప్రభుత్వం నూతన మెనూను ప్రకటించింది. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ప్రతీ రోజు ఇదే మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు నూతన మెనూ అమలును హాస్టళ్లలో అట్టహాసంగా ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి ప్రారంభించారు. ప్రస్తుత ధరలతో ఈ మెనూ అమలు సాధ్యం కాదని వార్డెన్లు చెబుతున్నారు.

నూతన మెనూ ప్రకారం ప్రతీ రోజు వివిధ రకాల కూరలతోపాటు ఉడకబెట్టిన కోడిగుడ్డు అందించాలి. ఇవన్నీ అమలు చేయాలంటే ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు సరిపోవని చెబుతున్నారు. మెనూ అమలుకు జిల్లా సంక్షేమాధికారులు ఒత్తిడి తేవడం భావ్యం కాదంటున్నారు. దీంతో వార్డెన్లు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే మెనూ అమలులో ఇబ్బందులను వినతి పత్రాల ద్వారా తెలిపారు. కామన్ మెనూ రాకముందే పెరిగిన మెస్ ఛార్జీలతో విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని వార్డెన్లు చెబుతున్నారు. మెస్ ఛార్జీలు పెరిగినప్పుడు విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల పరిమాణం (గ్రాములు) పెరగాలి కానీ కామన్ మెనూలో ఆహార పదార్థాల పరిమాణం (గ్రాములు) తగ్గించడం వల్ల నాణ్యమైన ఆహారం పిల్లలకు ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే పెంచిన మెస్ చార్జీల ప్రకారము చికెన్ కళాశాల విద్యార్థులకు 150 గ్రాములు వుంటే, కామన్ మెనూలో 70 గ్రాములు నుంచి 100 గ్రాములు మాత్రమే వున్నది. మటన్ 50 గ్రాములు మాత్రమే వున్నది. ఇలా చూస్తే అన్నీ ఆహార పదార్థాల పరిమాణం (గ్రాములు) తగ్గించారు.

మెనూ ఖర్చు వివరాలు ప్రకటించాలి..

నూతన మెనూ అమలు చేయాలంటే ముందుగా ఆహార పదార్థాల ధరలు, ఒక్కో విద్యార్థికి ప్రతి రోజు ఆహారంలో అందించాల్సిన కూరలు, వాటి పరిమాణాన్ని, ఖర్చుల వివారాలు ప్రకటించాలని వార్డెన్లు అంటున్నారు. అప్పుడే విద్యార్థుల సంఖ్యను బట్టి నూతన మెనూ అమలు చేయడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ జిల్లాల్లో వివిధ రకాల అప్రూవల్ డీపీసీ (డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ) రేట్లు ఉన్నాయి. ప్రస్తుతం గురుకులాల్లో ఇచ్చిన విధంగా గ్యాస్‌తో సహా అన్ని వస్తువులు టెండర్ ద్వారా సరఫరా చేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు.

మూడు స్లాబ్‌లు.. ఒకే మెనూ

ప్రభుత్వం పెంచిన కొత్త డైట్ చార్జీలను మూడు స్లాబ్‌లలో ఇచ్చింది. మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు 1,330 రూపాయలు, ఎనిమిది నుంచ పదో తరగతి విద్యార్థులకు 1,540, ఇంటర్, పీజీ విద్యార్థులకు 2,100 రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ఈ మూడు స్లాబ్‌లలో ఉన్న విద్యార్థులకు కామన్ మెనూ ఇచ్చింది. ఇది ఎలా అమలు చేయాలో తెలపలేదు. దీంతో వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. కామన్ మెనూ అమలు సాధ్యాసాధ్యా లపై సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో 54 సంక్షేమ హాస్టల్స్

జిల్లా వ్యాప్తంగా 54 సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో 6,950 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహాల్లో సరిపడా నాలుగో తరగతి సిబ్బంది లేరు. ఉన్నవారికి కొత్త మెనూలో ఉన్న ఆహార పదార్థాలు వండడంలో నైపుణ్యం లేదు. వారికి శిక్షణ ఇచ్చి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాలుగో తరగతి సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం విద్యార్థులకు రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబారు మాత్రమే ఇస్తున్నారు.



మిగతా 8వ పేజీలో

ప్రజలు సుఖ శాంతులతో జీవించాలి

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్/కరీంనగర్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు చూపిన మార్గంలో పయనిస్తూ ప్రజలు సుఖ శాంతులతో, సంతోషంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్టు బెన్ఫిషరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. సాటి వారితో శాంతంగా ఉంటూ ప్రేమపూర్వకంగా మెలగాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమీషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, ఏవో సురేందర్, తహసీల్దార్ నరేందర్, మైనార్టిటీ సంక్షేమ శాఖ అధికారులు, ఆయా అసోసియేషన్ల బాధ్యులు ఎం క్రిస్టఫర్, జాన్, సత్యం, గుండ్ర కృపాదానం, అజయ్, పీటర్, జాషువా పాల్గొన్నారు.

కార్నివాల్ సందర్శన...

జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినులు తయారు చేసిన వస్తువులతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కారివ్నాల్‌ను కలెక్టర్, నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పేయి, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వస్తువులను కొని విద్యార్థినులకు బహుమతి అందించారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలి

సీపీ అభిషేక్ మొహంతి

గంగాధర, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీపీ అభిషేక్ మొహంతి పోలీసులకు సూచించారు. గంగాధర పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో కేసులపై సమీక్ష నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిబ్బంది గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి గ్రామానికి సిబ్బందిని కేటాయించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

నేడు దిశ సమావేశం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశాన్ని ఈ నెల 24న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల భిక్షాటన



భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ఎం అజిత, బి రమాదేవి, ఎన్ పూర్ణిమ, గౌతమి, పి మాదవి, పి కిరణ్‌జ్యోతి, ఎం స్వప్న, ఏ సునీత, పి మధులత, వరలక్ష్మి, నీరజ, రవిచందర్, అంజనేయులు, వెంకటేష్, శ్రీకన్య, బి రమేశ్ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ద్వారా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, టీఎన్‌జీవోస్ కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కిరణ్ కుమార్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట రామస్వామి, శంకర్, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకన్న, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు రోహి త్, సర్దార్ హర్మిందర్‌సింగ్, సహాధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, గంగారపు రమేశ్, మాన్సిత్‌సింగ్, నేరెళ్ల కిషన్ మద్దతు ప్రకటించారు.



దీక్షలో మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ టీచర్స్, లెక్చరర్స్ ఫోరం మద్దతు..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు తెలంగాణ టీచర్స్, లెక్చరర్స్ ఫోరం (టీటీఎల్ఎఫ్) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా టీటీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, కార్య నిర్వాహణ అధ్యక్షుడు వంగపల్లి రాజేశ్వర్, లింగంపల్లి రాజేశ్వర్, వి సత్యం, నాగరాజు, రమణ, సముద్రాల లింగారావు, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలి

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరంనగర్ మండలం చర్లబూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు సమకూర్చిన ఆట వస్తువులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. చిన్నారుల సంక్షేమానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆట పాటలతో చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, జ్ఞానం పెరిగేలా ప్రీస్కూల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఎదుగుదలను పర్యవేక్షిస్తూ నెలవారీగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిశుక్రవారం నిర్వహించే శుక్రవారం సభకు వచ్చి అన్ని వివరాలు తెలుసుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. వంట గది నిర్మాణం చేపట్టాలని చేపట్టాలని పలువురు కోరగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారి సంజీవరావు, అర్బన్ ఎంఈవో ప్రమోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, దాతలు బుట్టి శారద, విక్రమ్ రూరల్ ఎంఈవో రవీందర్ పాల్గొన్నారు.

బల్దియా దుకాణాల కేటాయింపుపై **విచారణ జరిపించండి**
- అర్హులైన వారికే కేటాయించాలి
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

- కరీంనగర్ టౌన్ 8లో

తక్కువ విస్తీర్ణం.. ఎక్కువ పంటలు
- మూడు ఎకరాల్లో 8 రకాలకు పైగా కూరగాయల సాగు
- స్వయంగా మార్కెట్‌లో విక్రయం

- వీణవంక 6లో

గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలి
మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్
-సుభాష్‌నగర్ 8లో

పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం -కరీంనగర్ అర్బన్
సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కార్పొరేషన్‌లో విలీనం వద్దు

చింతకుంటలో ఉపాధి హామీ కార్మికుల రాస్తారోకో

భగత్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతకుంట గ్రామాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని కోరుతూ గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కార్మికులు సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామ సభలు నిర్వహించకుండా ఏకపక్షంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న గ్రామం కార్పొరేషన్‌లో విలీనమైతే పన్నులు పెరిగి, అభివృద్ధి పనులు జరుగక సామాన్యులు ఇబ్బందులు పడతారన్నారు. అనంతరం ఉపాధిహామీ కార్మికులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు రేణయ్య, రేణిగుంట రాజు, శంకరయ్య, సోమిరెడ్డి లచ్చిరెడ్డి, కరుణాకర్, చెట్టపల్లి నరేందర్, తిరుపతిగౌడ్, వాజిద్ రైస్, అంజయ్య, ఎల్లయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



చింతకుంటలో రాస్తారోకో చేస్తున్న ఉపాధిహామి కార్మికులు, నాయకులు

లైంగిక వేధింపుల కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

[illegible]

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు శిక్ష

కరీంనగర్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నదనే కారణంగా భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు షేక్ రఫీక్(35)కు జీవితఖైదు శిక్ష, జరిమానాను విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ సోమవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కరీంనగర్‌లోని హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన షేక్ రఫీక్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా కుటుంబంలో గొడవలు అయి పెద్ద మనుషుల పంచాయితీ జరిగింది. అయినప్పటికీ రఫీక్‌లో మార్పు రాలేదు. 2020 ఏప్రిల్ 24న ఇదే విషయంపై రఫీక్‌ను అయన భార్య నిలదీయగా ఆగ్రహంతో ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మృతురాలి తండ్రి కరీంనగర్ మూడో టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వీణవంక,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఈ నెల 13న ప్రమాదానికి గురి కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మత్తమారి ఓదెలు(73) గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద నీటి పైపులను అతికించేందుకు చిన్న మంట పెట్టి అతికిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎండుగడ్డికి అంటుకున్న క్రమంలో ఓదెలు కాలు జారీ మంటల్లో పడగా శరీరం కాలిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మత్తమారి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తంగళ్లపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) గంజాయి తాగుతూ, అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని తాడూర్ గ్రామ శివారులో సోమవారం ఎల్లమ్మ గుడి వద్ద, తంగళ్లపల్లి గ్రామానికి చెందిన కుంటి అభిలాష్, టెక్స్‌టైల్ పార్క్‌కి చెందిన కనుకుంట్ల మహేష్ అలియాస్ మప్పిలు గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తూ పట్టుబడగ, వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య


వరుణ్‌ప్రియ (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద పాపయ్యపల్లిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వరుణ్‌ప్రియ (18) హన్మకొండలో డిగ్రీ చదువుతుంది. ఈ క్రమంలో తన అమ్మమ్మ ఊరైనా పెద్దపాపయ్యపల్లి గ్రామానికి వచ్చింది. ఇంట్లో వారు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే గ్రామానికి చెందిన గుంపుల అజయ్ అనే యువకుడు వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.


గాండ్ల మహేందర్ సాగు చేసిన పంటలు

తక్కువ విస్తీర్ణం.. ఎక్కువ పంటలు

- మూడు ఎకరాల్లో 8 రకాలకు పైగా కూరగాయల సాగు
- స్వయంగా మార్కెట్‌లో విక్రయం

వీణవంక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు సాగు చేయాలనే ఆలోచనతో తనకు భూమి లేకున్నా మూడు ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. అందరి కంటే భిన్నంగా ఆలోచించి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంట సాగు చేయాలని అనుకున్నాడు. మరో వైపు పంటకు మొత్తం డ్రిప్ ఏర్పాటు చేసి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తున్నాడు. వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన గాండ్ల మహేందర్ అనే రైతు మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేస్తూ నష్టం రాకుండా చూసుకుంటున్నాడు.

మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా విస్తీర్ణం పెంపు

గాండ్ల మహేందర్ తను తీసుకున్న మూడు రకాల కౌలు భూమిలో టమాట, మిర్చి, కాకరకాయ, బీరకాయ, అలసంద, క్యాబేజీ, దోస, బెండ, చిక్కుడుకాయ, వంకాయ లాంటి పంటలను సాగు చేస్తున్నాడు. మార్కెట్లో ఏ కూరగాయాలకు డిమాండ్ ఉందో తెలుసుకున్న తరువాత ఆ పంట విస్తీర్ణం పెంచుతున్నాడు. పంట వ్యవధి మూడు నెలలు కావడంతో సంవత్సరానికి దాదాపు నాలుగు సార్లు పంట చేతికి వస్తుండటంతో సంవత్సరానికి ఖర్చులన్నీ పోను రూ. 2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నట్లు తెలిపారు. సాగులో పూర్తిగా సేంద్రియ ఎరువులను మాత్రమే వాడుతున్నట్లు తెలిపారు. భార్యభర్తలిద్దరూ సమన్వయంతో గాయలు సాగు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాగు చేసిన పంటను నేరుగా వీణవంకలో శుక్రవారం జరిగే సంతలో విక్రయిస్తుంటారు. జమ్మికుంట, కరీంనగర్ సంతలో కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు నేరుగా అందిస్తున్నారు.

పరిస్థితులను బట్టి సాగుచేయాలి

గాండ్ల మహేందర్, కిష్టంపేట

నూతన విధానంతో మూడేళ్లుగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నా. సాగులో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని డ్రిప్ విధానం ద్వారా పంటను సాగు చేస్తున్నా. పరిస్థితులను బట్టి మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు విస్తీర్ణం పెంచుతున్నాను. ప్రభుత్వం తరఫున చేయూతనందించాలని కోరుతున్నా.



అంతర్రాష్ట్ర మహిళా దొంగ పట్టివేత

- 31.5 తులాల బంగారం స్వాధీనం

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర మహిళ దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రఘు చందర్ విలేకరుల సమావేశం నిర్వహించి మహిళా దొంగను అరెస్టు చూపించి ఆమె వద్ద 31.5 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని పూర్తి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ,నాగపూర్ సిటీలోని రామేశ్వరి టోలి ఏరియా ప్రాంతానికి చెందిన స్వప్న మిథున్ లాండే, హత్గాడే కాంత, హత్గాడే గుజాన, సంజన నాడే అనే నలుగురు మహిళలు బస్టాండ్‌లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో సంచరిస్తూ దొంగతనాలు చేసే ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 16న ఈ ముఠా సభ్యులు జగిత్యాల పాత బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి జలజ బ్యాగు నుంచి 37 తులాల బంగారు నగలను అపహరించుకవెళ్లారు. బాధితురాలు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ముఠాను పట్టుకునేందుకు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీముల ఏర్పాటు చేశారు. ముఠా సభ్యురాలు హత్గాడే కాంత సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులకు పట్టుబ డింది. విచారణలో అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాలో సభ్యురాలిగా గుర్తించారు. ముఠా సభ్యు లు నాగ్‌పూర్ నుంచి మంచిర్యాలకు ట్రైన్‌లో వచ్చి మంచిర్యాల, లక్సెట్టిపేట, జగిత్యాల, సిరిసిల్ల, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల్లో తిరుగుతూ బస్సులలో ప్రయాణించే వారిపై నిఘా పెట్టి విలువైన బంగారు ఆభరణాలు దోచుకునే ముఠాగా ఏర్పడినట్లు డీఎస్పీ వివరించారు. అరెస్టు చేసిన మహిళ వద్ద 31.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు మహిళా దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మధ రావు, గీత ఉన్నారు.


నిందితురాలిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గతంలో మండలంలోని ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న జ్యోతిబా పూలే బాలికల పాఠశాలను ఆయన సందర్శించినప్పుడు నీటి సమస్యతో ఇబ్బందుల పడుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మూడు రోజుల క్రితం బోరు వేయించగా సోమవారం బోరుకు మోటర్ అందించి నీటి పంపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ మెరుగుకోసం పాటుపడతానన్నారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యగ్నేష్, మండలాధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.


బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కేసు భయంతో.. ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి చిన్న నర్సయ్య(45)అలియాస్ ఇచ్చన్న అనే యువకుడు పోలీసు కేసు భయంతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి నవీన్, జంగిటి చిన్న నర్సయ్య ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ఓ మామిడి తోట వద్ద శనివారం రాత్రి జంతువులను వేటాడేందుకు వెళ్లారు. అంతకు ముందే అక్కడ వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు నవీన్ కాలికి తగలడంతో విద్యుదాఘాతంతో అదే రాత్రి నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నర్సయ్యపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి చిన్న నర్సయ్య ఇంటికి రాకుండా పరారీలో ఉన్నాడు. ఈ భయంతోనే గ్రామ శివారులోని తన పొలం పక్కన సోమవారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సయ్య భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూమి విక్రయిస్తానని డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వ్యక్తిపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన వల్లెపు మొగిలికి బుగ్గారం మండల కేంద్రంలో 13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి పక్కనే జక్కుల లింగారెడ్డికి 5.05 ఎకరాల భూమి ఉండగా రూ. 60 లక్షలకు మొగిలికి విక్రయించేందుకు లింగారెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నాడు. డబ్బులు ముట్టినప్పటికీ లింగారెడ్డి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వేరే వ్యక్తికి కొంత భూమిని విక్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు లింగారెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన అడువాల కృష్ణ అనే వ్యక్తి ఆదివారం రాత్రి పట్టణంలోని యావర్ రోడ్ నుంచి తన కారులో వెళుతుండగా అకారణంగా ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కారు అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు కృష్ణపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దెల యశ్వంత్, ఆలకుంట విజయ్, రెడ్డిమల్ల స్నేహిత్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

బాలుడిపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలుడిపై అత్యాచారం కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాషిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామానికి చెందిన గోగుల సాయి కుమార్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ బాలుడిని మామిడి కాయలు తెచ్చుకుందామని చెప్పి గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై మల్లాపూర్ అప్పటి ఎస్సై పృథ్వీధర్ కేసు నమోదు చేశారు. సీఐ రవి కుమార్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు సాక్షాలను, శాస్త్రీయ ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సాయికుమార్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కథలాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపెటకు చెందిన సిరసు పెద్దరాజం (65) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న పెద్దరాజంను రమేశ్ అనే మేస్త్రీ ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం బొంపల్లి అనుబంధ గ్రామమైన మేరపల్లికి చెందిన ఒల్లపు రాజమ్మ పూరి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. ఒళ్లపు రాజమ్మ పొలం పనులకు వెళ్లగా సోమవారం ప్రమాదవశాత్తు ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. మహిళా గ్రూపుల ద్వారా తీసుకున్న రూ.1.65 లక్షల నగదు, తులం బంగారం, పది తులాల వెండి, నిత్యావసర వస్తువులు, బీరువా, టీవీ నిత్యావసర సరుకులు దగ్ధం అయినట్లు బాధితురాలు రాజమ్మ పేర్కొంది.

కాలువల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలి

సారంగాపూర్, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : కాలువల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టరు సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి, సారంగాపూర్ మండ లంలోని రేచపల్లి, రంగపేట గ్రామాల్లో ఉన్న ఎస్సారెస్పీ డి 53, 12 ఎల్ఆర్ కాలువలను కలెక్టరు సత్యప్రసాద్ ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కెనాల్ దెబ్బతిన్న ప్రాంతంలో డ్రాఫ్ట్ మరమ్మతుల కోసం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే రేచపల్లి, రంగపేట కాలువల్లో పూడిక తీత పనులకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయా మండలాలకు ఓటి అప్టెక్ ద్వారా 64 వేల ఆయకట్టుకు నీరందించాలని, రేచపల్లి కెనాల్ ద్వారా సారంగాపూర్ బీర్‌పూర్ మండలాల చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డీఆర్‌డీవో రఘు వరణ్ ఉన్నారు.

బాలిక అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని మోసం చేసి బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి డి వెంకటేష్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కొత్తపెల్లి మండలం రేకుర్తికి చెందిన కుంచం రవి, ఒక బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి తన వెంట సెప్టెంబరు 20, 2021న తీసుకొని వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ విజ్ఞాన రావు దర్యాప్తు జరిపి అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ డి శరత్ సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు. నేరం నిరూపణ కావడంతో జిల్లా జడ్జి నిందితుడికి 10 సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ, తక్కళ్లపల్లి, దూలూరు పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. శనివారం రాత్రి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, పోలీసు సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మూడు రోజులు గడుస్తున్నా కేసు నమోదు చేయలేదు. ఈ విషయమై ఎస్సై నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా రెవెన్యూ అధికారుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ ప్రసాద్

కమాన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపల్లి గ్రామానికి చెందిన వరాల సాత్విక్ తన ఫోన్‌ను పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్ట్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ని గుర్తించి సోమవారం ఫిర్యాదుదారుడు వరాల సాత్విక్‌కు ఎస్ఐ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్‌ను పొగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి అందిస్తామని, బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

యాసంగి సాగుకు నీటిని విడుదల చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల యాసంగి సాగుకు ఎల్ఎండీ కెనాల్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గిట్ల ముకుందరెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ ప్రారంభమై నారు మడులు ఎదిగినప్పటికి రైతాంగం నాట్లు వేసుకోవాలంటే నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం కెనాల్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయిన టువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేద వారికి వెంటనే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, చంద్రయ్య, సారయ్య, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూమిని దున్నకుండా అడ్డుకున్న వ్యక్తి అరెస్టు

చందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమి దున్నకుండ అడ్డుకోవడమే కాకుండా పంట సాగు చేస్తే చంపుతా నని బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై అంజయ్య సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలం లోని అనంతపల్లి గ్రామానికి చెందిన సిందర వేణి నారాయణ సలెంద్ర మల్లయ్య వద్ద 1. 35 భూమి కొనుగోలు చేశాడు. కొను గోలు చేసిన భూమిలో నారాయణ, సత్తవ్వ అతని కుమారుడు శ్రీధర్‌లు కలిసి భూమిని సాగు చేస్తుండగా, ఇదే గ్రామానికి సలేంద్ర గంగయ్య భూమిలో పంట సాగు చేయవద్దని భూమిలో పంట సాగు చేస్తే చంపుతానని బెదిరిస్తున్నాడని నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సలేంద్ర గంగయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పంట ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు

చందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తనకున్న వ్యవసాయ భూమిలో వరి పంటను సాగు చేయగా రామన్నపేట, ఆసిరెడ్డిపల్లి చెందిన కొందరు వ్యక్తులు పంట చేనులో బండరాళ్లు వేసి పంటను ధ్వంసం చేశారని న్యాయం చేయాలంటూ దళిత మహిళ రైతు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. బాధిత దళిత మహిళ రైతు కథనం ప్రకారం మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన పురుగుల నర్సవ్వకు చందుర్తి గ్రామ శివారులో సర్వే నం: 198/ఆ/ఆ/2, విస్తీర్ణము ఎకరం 35 గుంటలు కలదు. భూమిని సాగు చేసుకొంటు అందులో వచ్చిన పంటను అనుభవిస్తునది.

రామన్నపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో పాటు ఆసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాకేష్, రాజ, దేవయ్య అనే వ్యక్తులు ఈ నేల 21న రాత్రి వేళలో భూమిలోని వరినారులో బండలు వేసి వరినారును ధ్వంసం చేశారని తెలిపింది. గత సంవత్సరము కూడ వరి పంట చేతికి అందే సమయంలో ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారన్నారు. భూమి దగ్గరికి పోతే నన్ను నా కుటుంబ సభ్యులందరిని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని, రక్షణ కల్పించి, న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


కొండపైన ఉన్న హరిత హోటల్

కొండగట్టు హరిత హోటల్‌లో అరకొర వసతులు

- గదుల అద్దెకే పరిమితం
- టిఫిన్స్, భోజనం దొరకక భక్తుల ఇబ్బందులు

మల్యాల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో కొండపైన పదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వ పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత హోటల్ పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదు. గదుల అద్దెతో పాటు హోటల్ నిర్వహణ అందుబాటులో ఉంటూ కొండపైకి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు టీ, టిఫిన్స్, బోజనం అందించాల్సి ఉండగా కొన్నేళ్లుగా హోటల్ నిర్వహించడం లేదు. దీంతో హరిత హోటల్ ఉందని వచ్చే భక్తులు బోజనం, టిఫిన్స్ దొరక్క తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హరిత హోటల్ మొదటి, రెండవ అంతస్తులో పది గదులు అద్దెకు ఇస్తుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో హోటల్ నిర్వహించే వారు. అయితే ఇప్పుడు హోటల్ అందుబాటులో లేదు. కరోనా కాలం నుంచి హోటల్ మూలన పడగా ఓ ఏడాది పాటు స్థానికులు లీజుకు తీసుకున్నారు. లీజు సొమ్ములు ఎక్కువ అవుతున్నాయని గిట్టుబాటు కావడం లేదని లీజుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇక పది గదులలో 8 ఏసీ, 2 సాధారణం గదులు కాగ అవి కూడా కొండపైన భక్తుల రద్దీ ఉన్నప్పుడే ఆన్‌లైన్‌లో బుక్ అవుతున్నట్లు నిర్వహకులు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 11 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఐదుగురు, ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో ఇద్దరు డీబార్ అయినట్లు తెలిపారు.

వేతనాలు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ కృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతూ రాష్ట్ర అంసెబ్లీ తీర్మానం చేయాలని భాతరకార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందికర పరిస్థితుల్లో కుటుంబాలను పోషించుకుంటున్నట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తున్నాయని అన్నారు. జీవో నంబర్ 22ను గెజిట్ చేయాల్సి ఉన్నా పక్కనబెట్టారని, దాన్ని గెజిట్ చేస్తే కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరుగుతుందని కృష్ణ తెలిపారు. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇటీవల అసెంబ్లీలో కొందరు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై మాట్లాడారని, వారి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతూ తీర్మానం చేయాలని కృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్, నాయకులు కుందారపు శారద, లింగయ్య, అంజలి, ధర్మేందర్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకుని విద్యావ్యవస్థపై సమీక్షలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖాధికారులు వత్తాసు పలుకుతున్నార్నారు. శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి విద్యాశాఖకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలన్నారు.

ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, సాయికృష్ణ, శ్రావణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమందలే ఆధారం

- ఆవులతో ఉపాధి పొందుతున్న గిరిజన రైతులు
- భూసారం పెంచుకునేందుకు రైతుల ఆసక్తి

ఆవులే వారికి జీవనాధారం. తరతరాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించు కుంటున్నారు. వందల సంఖ్యలో ఆవులను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. పొలాల్లో ఆవుల మందలను మేపడంతోపాటు వ్యవసాయ అవసరాలకు కోడెలను విక్రయించి ఆదాయం సమకూర్చు కుంటారు. ఏడాదిలో ఆరు నెలలపాటు సంచారం చేసి తిరిగి సొంత ఊర్లకు చేరుకుంటారు.



రుద్రంగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆవులే ప్రధాన ఆదాయ వనరుగా రుద్రంగి మండలం గిరిజన తండాలకు చెందిన పలువురు రైతులు ఉపాధి పొందుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సుమారు 20 మంది గిరిజన రైతులు ఆవుల మందలను సాదుతున్నారు. ఒక్కో మందలో 200వరకు ఆవులు ఉంటాయి. ఏటా ఆరు నెలలపాటు ఆవుల మందలను ఊరూరా తిప్పుతారు. స్థానిక రైతులు రాత్రిపూట ఆవులను తమ పొలాల్లో ఉంచాలని కోరు తుంటారు. ఆ రోజు రాత్రి మొత్తం పొలంలో ఆవులు, మూత్రం, పేడ వేస్తాయి. దీంతో భూమి సారవంతమై దిగు బడులు పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు పండుతాయి. కొంత మంది రైతులు వారం నుంచి పది రోజుల వరకు తమ పొలాల్లో ఆవుల మందలను మేపుతారు. యజమానికి 500 పశువుల మందకు రోజుకు రూ.6 వేల నుంచి రూ.7వేలు, పది రోజులపాటు పొలంలో కట్టేస్తే సుమారు రూ.70 వేల వరకు చెల్లిస్తారు. వీటితో పాటు రోజుకు 10 కిలోల చొప్పున బియ్యం ఇస్తారు. దీంతోపాటు మందలోని కోడెలను వ్యవసాయ అవసారా లకు రైతులకు విక్రయిస్తారు. ఏటా నవంబరులో వరి కోతలు ప్రారంభమైనప్పటి నుంచి ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఆరు నెలల పాటు ఆవుల మంద లతో సంచారం చేస్తారు. సాగు పనులు మొదలయ్యాక సొంత గ్రామాలకు తిరిగి వస్తారు. అటవీ ప్రాంతంలో ఆవులను మేపుతూ వారికి ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు పండిస్తూ జీవనం సాగిస్తారు.



పొలంలో ఆవుల మంద

భూసారం పెంపునకు ఆవుల మంద

ఎర్రం అరవింద్, రైతు, రుద్రంగి



మా పొలంలో భూసారం పెంచడం కోసం 10 రోజులపాటు ఆవుల మందను ఉంచాం. పశువుల మల,మూత్ర విసర్జనలతో భూసారం పెరుగుతుంది. పశువుల మంద మా పొలంలో ఉంచడానికి రోజుకు రూ.7 వేలు చెల్లించాను. డబ్బులతోపాటు 10 రోజులకు రోజుకు పది కిలోల చొప్పున బియ్యం అందజేశాను. ఉండడానికి ఇతర సౌకర్యాలు కూడా కల్పించాం.

ఆరు నెలలపాటు సంచారం

మాలోత్ తిరుపతి, ఆవుల మంద యజమాని



నవంబరులో వరి కోతలు ప్రారంభమైనప్పటి నుంచి ఆవుల మందతో సంచారం చేస్తాం. భూసారం పెరుగుతుందని రైతులు ఆవుల మందను పొలాల్లో కట్టే స్తారు. మందను వ్యవసాయ భూముల్లో ఒక రోజు ఉంచినందుకు ఆవుల సంఖ్యను బట్టి డబ్బులు, బియ్యం చెల్లిస్తారు. రైతులకు ఉన్న భూమిని బట్టి వారం నుంచి పది రోజులపాటు ఉంచుకుంటారు.

ఇద్దరికి రైతునేస్తం పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్/ జమ్మికుంట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి రాజ్యలక్ష్మి తుమ్మేటి రఘోత్తంరెడ్డి మిద్దెతోట పురస్కారానికి ఎంపికయ్యారు. సోమవారం గుంటూరు జిల్లాలో రైతు నేస్తం ఫౌండేషన్ అవార్డులను ప్రదానం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 30 మందికి పురస్కారాలు అందిం చగా వనజ, రాజ్యలక్ష్మిలు పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు, వ్యవసాయ శాఖ సంచాల కుడు, ఐఏఎస్ అధికారి దిల్లీరావు, మిద్దెతోట నిపుణుడు రఘోత్తంరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ వేంకటేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. పురస్కారం కింద ప్రశంసా పత్రం, జ్ఞాపిక, ఆకుపచ్చని కిరీటం, శాలువా అందించి సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మిద్దెతో టలు, పెరటి తోటల పెంపకం చేస్తూ పకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వారికి 2021 నుంచి రైతునేస్తం ఫౌం డేషన్ వారు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. రసాయానిక ఎరువులు, పురుగు మందులు వాడని ఆహార దినుసులు, కూరగాయలు, ఆకుకూరలు పండించడాన్ని రైతునేస్తం ప్రోత్సహిస్తుంది. గత 10 సంవత్సరాలుగా తుమ్మేటి రఘోత్తంరెడ్డి మిద్దెతోటలను, పెరటి తోటలను విరివిగా ప్రచారం చేస్తున్నారు.



పురస్కారం అందుకుంటున్న దుబ్బాక వనజ



రైతునేస్తం పురస్కారంతో పుల్లూరి రాజ్యలక్ష్మి

పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 51 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కావద్దనే కల్యాణలక్ష్మి పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అంతకుముందు ఇల్లంతకుంట స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ప్రభుత్వం రాష్ట్రంలో ఆటల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సీఎం కప్ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, అయిలయ్య, ఉప్పుల అమేందర్, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, బాలపోచయ్య, ప్రసాద్, ఒగ్గు రమేష్, చల్ల నారాయణ, తిరుపతి, పుష్పలత, నరేష్. ప్రదీప్‌రెడ్డి, ఉస్మాన్, బెజ్జంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజన్నకు భక్తుల మొక్కులు



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పార్వతిపరమేశ్వరులకు ఎంతో ఇష్టమైన సోమవారం రోజున శ్రీస్వామి వారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం దర్శనం క్యూలైన్‌లలో బారులు తీరారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు కట్టేందుకు క్యూలైన్‌లో భక్తులు సమారుగా రెండు గంటలు నిరీక్షించి ఆలయంలోకి చేరుకుని ఆది దేవుడిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గండదీపంలో నూనే పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకుని, బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ అధికారులు తిరుపతిరావు, రాజేందర్, అశోక్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకుని శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అయ్యప్పమాల వేసుకున్న నేపథ్యంలో రాజన్న ఆలయానికి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో సీఎం కప్ క్రీడాపోటీలు



ఆర్చరీ పోటీలో పాల్గొన్న బాలబాలికలు



రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు..

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం ఆర్చరీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ బాలబాలికల పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఆర్చరీ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను కనబరిచారు. ఇండియన్ రౌండ్ 20 మీటర్లు, 30 మీటర్లు, రికర్వ్ 60 + 60 మీటర్లు, కాంపౌండ్ 50 + 50 మీటర్ల విభాగాలలో బాలబాలికలు పోటీ పడ్డారు. ఆర్చరీ వివిధ విభాగాలలో గెలుపొందిన బాలబాలికలకు ముఖ్య అతిథులు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా నాయకులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు, బాలబాలికలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఉషు పోటీలు..

కరీంనగర్ స్పోర్ట్స్ : జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫండస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సీఎం కప్ 2024 ఉమ్మడి జిల్లా ఉషు పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో అండర్-14, అండర్-18 విభాగాల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎంకప్ ఉషు పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, ఫండస్ పాఠశాల చైర్మన్ గోపు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు.



సెమీఫైనల్‌కు చేరిన జిల్లా బాలికల జట్టు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరింది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలికల జట్టు విశేష ప్రతిభచాటి క్వార్టర్ ఫైనల్స్‌లో హన్మకొండ జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్ సంయుక్త కార్యదర్శి సీహెచ్ సంపత్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను, కోచ్ పద్మలను సంఘ అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌కుమార్ అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు వెల్ది విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్ : బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు జిల్లాకు చెందిన వెల్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కె.రాంచరణ్ ఎంపిక య్యా డు. గత నెల 10, 11, 12 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన రాంచరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండీ యూనిస్‌పాషా తెలిపారు.



రాంచరణ్

అంతర్గాం స్పిన్నింగ్ భూములు అన్యాక్రాంతం

- ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేసిన కాందిశీకులు
- టెక్స్‌టైల్స్, రెవెన్యూ అధికారులు సీరియస్

గోదావరిఖని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం స్పిన్నింగ్ మిల్లుకు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం, స్పిన్నింగ్ మిల్లు ఆస్తులకు సంబంధించి లిక్విడేటర్ నిర్లక్ష్యాల కారణంగా స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించి 51.38ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులు అన్యాక్రాంతం చేస్తున్నారు. ఇంతకాలం చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు క్రమంగా లేఅవుట్‌ల దాకా వెళ్లారు. అంతర్గాంలో స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించిన భూములు సుమారు ఎకరానికి రెండు కోట్ల రూపాయల దాకా మార్కెట్ ధర పెరగడంతో భూమాఫియా ఈ భూములపై కన్నువేసింది. అయితే స్పిన్నింగ్ మిల్లు భూములకు సమీపాన ఉన్న పట్టా యజమానుల అండగా చేసుకుని ఈ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.

బర్మా, శ్రీలంక కాందిశీకుల సంఘం అన్యాక్రాంతమవుతున్న స్పిన్నింగ్ మిల్లుల భూముల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అంతర్గాం టెక్స్‌టైల్స్ కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్ లిమిటెడ్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించారు. సోమవారం టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సంతోష్, అంతర్గాం తహసీల్దార్ రవీందర్ క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

ఆక్రమణదారులను పిలిపించి ఇందులో జరిగిన నిర్మాణాలకు అనుమతి లేదని, ఈ భూములు మీవా, స్పిన్నింగ్ మిల్లువా తేలే వరకు ఎలాంటి నిర్మాణాలు, లే అవుట్‌లు చేయవద్దని హెచ్చరించారు. ఇందుకోసం జాయింట్ సర్వే నిర్వహిస్తామని, తరువాత ఆక్రమణకు గురైన భూములు ఎవరివో తేల్చుతామని చెప్పారు.



మిల్లు భూముల్లో చేపట్టిన నిర్మాణం

● పూర్వపరాలు పరిశీలిస్తే ...

1991లో స్పిన్నింగ్ మిల్లు బంద్ అయ్యింది. అప్పుడు 435మంది కార్మికులు స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నారు. 1998లో వీఆర్ఎస్ కింద కార్మికులను పూర్తిగా ప్రభుత్వం తొలగించింది. మిల్లు ఆస్తులు, భూములు విక్రయించి కార్మికుల బకాయిలు చెల్లించాలని లిక్విడేటర్‌ను నియమించింది. టెక్స్‌టైల్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లిక్విడేటర్‌గా నియమితులయ్యారు. ఇందులో భూములు సమస్యలు ఉన్న నేపథ్యంలో 2014లో అప్పటి జాయింట్ కలెక్టర్‌ను లిక్విడేటర్‌ను చేశారు. అప్పటికి కార్మికులకు 5.5కోట్ల రూపాయలు వేతనాల కింద మిల్లు బాకీ పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు లిక్విడేటర్‌గా ఉన్న అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదు. పైగా ఈపీఎఫ్‌కు కూడా మిల్లు బాకీ పడడంతో కార్మికుల పీఎఫ్ కూడా ఆగిపోయింది.

2022లో మిల్లులో ఉన్న యంత్రాలను విక్రయించి కొంత ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేసినప్పటికీ అవి సరిపోలేదు. మిల్లు యంత్రాల అమ్మకంలో కూడా టెండర్ ప్రక్రియ నుంచి యంత్రాలను అమ్మే ధర వరకు అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈపీఎఫ్‌కు పెనాల్టీలు, వడ్డీలు కోటి రూపాయల బకాయి తేలింది. దీంతో 185మందికి మాత్రమే పెన్షన్ అందుతున్నది. మరో 175మందికి పెన్షన్ కూడా రావడం లేదు. స్పిన్నింగ్ మిల్లుకు ఉన్న 51ఎకరాల భూములను అవస రం మేరకు అమ్మేసి కార్మికులకు చెల్లించాల్సిన 5.5కోట్ల రూపాయలతో పాటు ఈపీఎఫ్‌కు బాకీ ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే స్పిన్నింగ్ కార్మికులకు సంబంధించిన సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది. కానీ లిక్విడేటర్లు స్పిన్నింగ్ మిల్లు అంశాన్ని నిర్లక్ష్యం చేయడం కారణంగా కార్మికుల ప్రయోజనాలతో పాటు స్పిన్నింగ్ మిల్లు భూములు, ఆస్తులు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. దీంతో కాందిశీకుల సంఘం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు ఫిర్యాదు మేరకు ఇటు టెక్స్‌టైల్స్ అధికా రులు, అటు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇప్పటికైనా స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించిన 51ఎకరాల భూమిని ప్రభుత్వం హద్దులు పాది స్వాధీనం చేసుకోవాలని, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, ఈపీఎఫ్‌కు కట్టాల్సిన సుమారు కోటి రూపాయలను చెల్లించాలని బర్మా, శ్రీలంక కాందిశీకుల సంఘం డిమాండ్ చేస్తున్నది.

ఏడాది పాలనలో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం తప్పా మిగతావి అమలులోకి రాలేదని అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సీఎంగా కేసీఆర్ వేములవాడ పర్యటనలో ముంపు గ్రామాల నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఇచ్చిన హామీ నిలుపుకోలేదని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారని, ముంపు గ్రామాల నిర్వాసితులకు అప్పటికే పరిహారం ఇవ్వడంతో చట్టప్రకారం చేయలేక పోయామని అన్నారు. ఎన్నికల సమయంలో ముంపు గ్రామాల నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూంలు ఇస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఇస్తే స్వాగతిస్తామన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు వచ్చినప్పుడు రెండు జీవోలు ఇచ్చారని, జీవోలో మిగిలిన 4,696 మంది నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉండగా ముంపు గ్రామాల నిర్వాసితులకు రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, పది వేల పైచిలుకు నిర్వాసితుల్లో ఇల్లు, పరిహారం రానివారికి ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నీటి మాటలయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి కాళ్లేశ్వరం నీళ్లు లేకుండనే ధాన్యం పడిందని చెప్పారని, ముఖ్యమంత్రి, మంత్రులకు కాళ్లేశ్వరంపై అవగాహన లేదని అన్నారు. హైదరాబాద్‌కు మంచినీళ్లు, మూసి ప్రక్షాళనకు మల్లనసాగర్ నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని, మల్లన్నసాగర్ అనేది పార్ట్ ఆఫ్ కాళ్లేశ్వరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి సంవత్సరాలం పూర్తయ్యిందని, మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. భూకంపం వచ్చినా మేడిగడ్డ సెంటి మీటర్ కదలలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధిహామీ పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో శోభారాణి తెలిపారు. ఈ వార్షిక సంత్సరంలో చేసిన పనులపై నివేదికను గ్రామ సభల్లో నివేదిస్తారు. మంగళవారం బహదూర్‌ఖాన్‌పేట, ఎలబోతారం, 25న చేగుర్తి, మొగ్దుంపూర్, చామనపల్లి, బొమ్మకల్, 27న మందుల పల్లి, జూబ్లీనగర్, నగునూర్, 28న ఫకీర్ పేట, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, తహెర్ కొండాపూర్, దుర్శేడ్, దుబ్బపల్లి, చెర్లబూత్కూర్, 29న నాగుల మల్యాల గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

భగత్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-2 డిపోలో జరిగిన కార్యక్రమానికి ప్రయాణికుల విశేషణ స్పందన లభించింది. డయల్ యువర్ కార్యక్రమంలో 28 మంది ప్రయాణికులు కాల్ చేయగా, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని డిపో మేనేజర్ వి మల్లయ్య తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశంను కరీంనగర్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, గోపాల్‌రావుపేట తాజా మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న వెంకట రాంరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో యువ జన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సిరిపురం లావణ్య నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాజన్న సిరిసిల్ల జట్టుకు కరీంనగర్‌కు చెందిన ఈషా హాస్పిటల్ డాక్టర్ జేషీ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహ్మద్ మునీరుద్దీన్, జిల్లా అధ్యక్షులు పండుగ సంతోష్ పాల్గొన్నారు.

అన్నదానం

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ జన్మ దినం సందర్భంగా సోమవారం ఆసుపత్రి సిబ్బంది అన్నదానం నిర్వహించారు. జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, సిబ్బంది కోట కరుణాకర్, ఈశ్వర్, సాయి చరణ్, రాచమల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరమణారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య, నాయకులు గడ్డం విలాస్‌రెడ్డి, పడి శెట్టి భూమయ్య, కాంరెడ్డి రాంరెడ్డి, బొబ్బిలి విక్టర్, రామిడి రాజిరెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, పెద్దిగారి తిరుపతి, నూనె గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని ముకరంపురలో తెలంగాణ కరణం నియోగి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పీవీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు మాట్లాడుతూ పీవీ భారత దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. ఈనెల 29న హైదరాబాద్‌లో జరిగే బ్రాహ్మణ ఐక్య సదస్సుకు కరీంనగర్ నుంచి కరణం నియోగి బ్రాహ్మణ, అఖిల బ్రాహ్మణ సంఘం సభ్యులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగాచార్య సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: పీవీ నర్సింహారావు దేశానికి దిక్సూచి లాంటి వారని పోలాడి రామారావు అన్నారు. సోమవారం పీవీ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

●హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పీవీ చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

●చొప్పదండి: పీవీ సేవలు మరువ లేనివని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చొప్పదండిలో పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, మార్కెట్ చైర్మన్ మహేష్, నాయకులు గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతి, గుర్రం రాజేందర్‌రెడ్డి, గుర్రం రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కామన్ మెనూ అమలు చేయలేం..

(5వ పేజీ తరువాయి)

రాత్రి సమయంలో అన్నం, ఏదైనా కాయగూరలతో కూర, మజ్జిగతో పాటు వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు ఇస్తున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ అమలు చేయాలంటే ఒక్కో విద్యార్థికి వంద రూపాయలు కేటాయిస్తేనే సాధ్యమవుతుందని అంటున్నారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని మెనూ సిద్ధం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నూతన మెనూ అమలు చేయడం సాధ్యం కాదని, ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని కోరుతూ వార్డెన్లు కలెక్టర్లకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశారు. ధరలు, గ్రాములు ప్రకటించ కుండా మెనూ అమలు సాధ్యం కాదని స్పష్టం చేశారు.

● గురుకులాల్లో కాస్త మెరుగు

ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు విషయంలో గురుకుల విద్యాలయాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. గురుకులాలకు ఆహారం అందించే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. రోజు వారీగా విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాల్సిన కూరగాయలు, కిరాణ సరుకులు, పండ్లు, చికెన్, మటన్, గుడ్లు, పాలు కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. వచ్చిన సరుకులు, కూరగాయలను విద్యార్థులకు వండి పెట్టే పనిని ఏజెన్సీలకు అప్పగించారు.

బల్దియా దుకాణాల కేటాయింపుపై విచారణ జరిపించండి

-మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సివిల్ హాస్పిటల్ సమీపంలో బల్దియా వాణిజ్య దుకాణాల సముదాయంలో వీధి వ్యాపారులకు దుకాణాల కేటాయింపులో వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్‌ని కోరారు. అర్హులైన వీధి వ్యాపారులకు చేయూతనిచ్చేందుకే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దుకాణాల సముదాయాన్ని నిర్మించామన్నారు. కోర్టు ఆదేశాలతో కేటాయించిన దుకాణాల్లో ఎవరైనా అనర్హులు ఉంటే వెంటనే వారి పేర్లను తొలగించాలని అన్నారు. అర్హులైన వీధి వ్యాపారులను లక్కీ డ్రా ద్వారా దుకాణాలను కేటాయించడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా దుకాణాలను వీధి వ్యాపారులకు కేటాయించాలని మేయర్ సూచించారు.

'గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సబావత్ రాములు నాయక్ కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. జిల్లాలోని మైదానం ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ ఏర్పాటు చేయా లన్నారు. త్వరలో 33 జిల్లాలలో సంఘం కమి టీల ఏర్పాటు ప్రక్రియను పూర్తిచేస్తామని, కరీంనగర్ జిల్లా కేంద్రంలో గిరిజన సెమినార్‌ను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు కిషన్‌సింగ్ రాథోడ్ రాంనాయక్, జి రాందాస్‌నాయక్, తిరుపతి, రాజు, రవి, డాక్టర్ దశరత్, శ్రవణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో సత్తాచాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షులు, మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంకమ్మ తోటలోని మానేరు పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్స్ జూడో పోటీలను ఆయన తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలంపిక్ సంఘ సభ్యులు సిలివేరి మహేందర్, జిల్లా జూడో సంఘం సంయుక్త కార్యదర్శి ఎల్వీ రమణ, కోడూరి శేఖర్, ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

భగత్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా రైతు మిట్ట లక్ష్మయ్యను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధూకర్‌రావు, ఉషారాణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతు ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తీగలగుట్టపల్లి అమ్మగుడి ఎస్‌వీజేసీ బాలుర కళాశాలలో యోగా గంగోత్రి తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ఘనంగా నిర్వహించామని పోటీల నిర్వాహకుడు యోగా గంగోత్రి జనరల్ సెక్రెటరీ కె.ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌వీజేసీ ద్రోణాచార్య అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో 320 మంది పాల్గొని ప్రతిభ కనపరిచారు. కార్యక్రమంలో ఎస్‌వీజేసీ చైర్మన్, గంగోత్రి గౌరవ అధ్యక్షుడు ఊట్కూరి మహిపాల్ రెడ్డి, అధ్యక్షుడు రేవల్లి రాజలింగం, కళాశాల డైరెక్టర్లు వరప్రసాద్, కాంతాల రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పహాణీలను స్వాధీనం చేసుకోవాలి

సుభాష్‌నగర్, డిసెంబరు(ఆంధ్రజ్యోతి) 23: సీఐడీ ఆధీనంలో ఉన్న బొమ్మకల్ గ్రామానికి చెందిన పహాణీలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆ గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహాణీలు కావాలని అధికారులను అడిగితే అవి తమ వద్దలేవని, సీఐడీ అధికారుల వద్ద ఉన్నాయని చెబుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి పహాణీలను రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

26న అయ్యప్ప ఆలయంలో మండలపూజ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో గురువారం మండలపూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. దీక్షాపరులు, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

'వింధ్యావాలి'లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వింధ్యావాలి విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక అందరిని ఆకర్షించింది. క్రిస్మస్ తాత శాంటాక్లాజ్ వేషధారణలో విద్యార్థులకు బహుమతులను, చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ త్వరలో రేషన్‌కార్డులు మంజూరు'

భగత్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ త్వరలోనే ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో పలు అభివృద్ధి పనులను సుడా చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. పది లక్షలతో మహిళా సమాఖ్య భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆరు లక్షల వ్యయంతో ఐదు కూడళ్లలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మడుపు మోహన్, బానోతు శ్రవణ్‌నాయక్, పిట్టల రవీందర్, డీఈ రాజేంద్ర ప్రసాద్, కంకణాల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆహార పదార్థాలు కల్తీ కాకుండా చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండగల నేపథ్యంలో తినే పదార్థాలలో కలర్స్ ఫ్లేవర్స్ కలపకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూషకు వినతిపత్రం అందజేశారు. వినియోగదారులు సహజమైన ఆహార పదార్థాలతో తయారైన తినే పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీనిపై సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

'మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి'


పాలి క్లినిక్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని 35వ డివిజన్ సప్తగిరికాలనీలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ సైనికులతో కలిసి కోటి 52 లక్షల రూపాయలతో చేపడుతున్న ఈహెచ్‌ఎస్ పాలిక్లినిక్ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల కోసం పాలీ క్లినిక్ భవన నిర్మాణం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 12 గుంటల స్థలాన్ని గతంలోనే ప్రభుత్వం కేటాయించి ప్రస్తుతం సరైన నిధులు కేటాయించామని అన్నారు. భవన నిర్మాణంలో అన్ని రకాల సదుపాయాలు ఉండేలా భవన నిర్మాణం, వైద్యం చేయించుకునేలా వీలుగా నిర్మాణం చేయడం జరుగుతుందని అన్నారు. త్వరలోనే ఈ భవనంలోనే ఒక క్యాంటిన్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. మాజీ సైనికులకు ఎక్కడ ఇబ్బందులు ఉన్న నగరపాలక సంస్థపూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డిఫెన్స్ అధికారులు వికాస్‌సింగ్, నారాయణరెడ్డి, డెనిల్, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



హుజూరాబాద్‌లో ప్రణవ్‌కు నాగలిని బహూకరిస్తున్న రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతాంగానికి ప్రణవ్ శుభాకాంక్షలు తెలిపారు. రైతులు ప్రణవ్‌కు నాగలిని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రుణమాఫీ, సన్నరకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలబడిందన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని మందాడిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుం బాలను సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ పరామర్శించారు.

● చొప్పదండి: మండలంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ కర్షక ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియ దర్శిని, ఏవో వంశీకృష్ణ, ఏఈవోలు రమ్య, జ్యోత్స్న, సాయిప్రసన్న ఉన్నారు.

ఏజీపీగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్


శ్రీనివాస్‌గౌడ్

హుజూరాబాద్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వ లీగల్ అఫైర్స్ సెక్రటరీ జీవో ఆర్‌టీ నంబర్ 825 ద్వారా ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేయగా, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సీ3/1632/224 సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ గతంలో రెండు పర్యాయాలు ఏజీపీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్ నియామకం పట్ల హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, న్యాయ వాదులు గౌరు సమ్మిరెడ్డి, సాయన్న, ముక్కెర రాజు, లక్ష్మణమూర్తి, శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

సైదాపూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమై బాధ్యతలు చేపట్టిన దొంత సుధాకర్, వైస్ చైర్మన్ రాజ్‌కుమార్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన సారబుడ్ల రాజిరెడ్డిలను వెన్నంపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాఘవులు ఉన్నాడు.

సమాజంలో సామరస్యం వెల్లివిరియాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


చొప్పదండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

తిమ్మాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సామరస్యం వెల్లివిరియాలంటే యేసు బోధనలను ఆచరించటమే మార్గమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలోని అరుంధతి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యేసుక్రీస్తు ప్రేమ భావాన్ని, సేవాతత్పరతను, క్షమాగుణాన్ని బోధించారని, వీటిని ఆచరించడం ద్వారా మనిషి సన్మార్గంలో నడవాలని అన్నారు. క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేర వ్స నరేందర్, ఫారుఖ్, మానకొండూరు డిప్యూటీ తహశీల్దారు సమ్మయ్య, ఆర్ఐ సతీష్, పాస్టర్లు సామ్యేల్, ఇషాక్ పాల్గొన్నారు.

● చొప్పదండి: ఏసుక్రీస్తు బోధనలు అందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం చొప్పదండిలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రైస్తవులకు విందు కార్యక్రమంలో మాట్లాడారు. కులమతాలకు అతీతంగా క్రిస్మస్ పండుగను జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు అమర్చుకోవాలి

శంకరపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని ఏఈ శ్రీరామోజు రఘు పేర్కొన్నారు. మొలంగూర్‌లో విద్యుత్ అదాపై రైతులకు ఆముదాలపల్లి ఏఈ శ్రీరామోజు రఘు సోమవారం అవగాహన కల్పించారు.

కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

శంకరపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సర్వేయర్ నిర్లక్ష్యా నికి నిరసనగా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మొలంగూర్ అంబేద్కర్ యువజన సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు మోరె గణేష్‌తో పాటు కల్వల మాజీ సర్పంచ్ దాసరపు భద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు అంతడుపుల సతీష్‌లను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

హుజూరాబాద్‌రూరల్,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలను రైతులు పాటించాలని ఏఈవో సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సిర్సపల్లి గ్రామంలో అంబాల ప్రభాకర్‌కు చెందిన రైతు నారుమడిని పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు.

శంకరపట్నం మండల బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక

శంకరపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో మండల ఎన్నికలాధికారి ఆకుల రాజేందర్ సమక్షంలో సోమవారం బీజేపీ బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. మొలంగూర్‌లో 114వ బూత్ అధ్యక్షుడిగా మారాటి వెంకటేశ్వర్, 116వ బూత్ అధ్యక్షుడిగా బండి అనిల్, అంబాలాపూర్‌లో 79వ బూత్ అధ్యక్షుడిగా రాణవేణి నగేష్, 80వ బూత్ అధ్యక్షుడిగా పెద్దాపురం వీరస్వామి, ఎరడపల్లిలో 97వ బూత్ అధ్యక్షుడిగా నేదురు శ్రీనివాస్, 98వ బూత్ అధ్యక్షుడిగా జాలిగం నాగయ్య, 99వ బూత్ అధ్యక్షుడిగా జింగ స్వామి, పాపయ్యపల్లెలో 109వ బూత్ అధ్యక్షుడిగా చెంచు సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మిరెడ్డి, కొంరయ్య, నరేందర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో కేజీబీవీ ఉపాధ్యాయులు

● పూర్తి కాని సిలబస్ ● మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు


కేజీబీవీ పాఠశాలలో హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

ఇల్లందకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని ఉపాధ్యాయులు 14 రోజుల నుంచి సమ్మెలో ఉన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద పనిచేసే ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలని కోరుతున్నారు. ఇల్లందకుంట మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 275 మంది విద్యార్థులు ఉన్నారు. 28మంది ఉపాధ్యాయులుగా ఉండగా, 14మంది బోధన సిబ్బంది, 14మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షలు కొనసాగుతున్నాయి. కేజీబీవీ లోని విద్యార్థులకు భోజనం, ఇతరాత్ర విషయంలో అసౌకర్యం కలుగకుండా బోధనేతర సిబ్బందితో పాఠశాలను నెట్టుకొస్తున్నారు. బోధించడానికి మాత్రం ఉపాధ్యాయులు లేకపోవ డంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. మార్చి నుంచి ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉన్నది. బోధన సిబ్బంది ప్రతిరోజు సమ్మెలో పాల్గొంటున్నారు. ఒక సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, ఏఎన్‌ఎం, నాన్ టీచింగ్ వాళ్లు మాత్రమే పాఠశాలల్లో ఉంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగులు కోరుతున్నారు.

● సంక్షిప్తం..

●మానకొండూర్: చెంజర్ల గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం బోళ్ళ రాణాప్రతాప్ జ్ఞాపకార్థం కూతురు అపర్ణ మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి సోమవారం రూ.21252 ఆర్థిక సహాయం అందజేశారు.

●మానకొండూర్: పచ్చునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత మేళా నిర్వహించారు. కార్యక్రమంలో పోరెడ్డి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, కాత్యాయని, సురేందర్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని సాయి రూప గార్డెన్‌లో మంగళవారం ప్రభుత్వ క్రిస్టమస్ ఫీస్ట్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కనకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

●రామడుగు: వెలిచాల గ్రామంలోని వెలిచాల సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి దైవాల ప్రనీష్ జిల్లా స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

●గంగాధర: గంగాధర మండలం వివేకానంద విద్యాలయం విద్యార్థులు ఆర్ట్ కాంపిటీషన్‌లో జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. శాన్విశ్రీ రెండవ బహుమతి, శివదీక్షిత నాలుగవ బహుమతి పొందినట్లు తెలిపారు.

●వీణవంక: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు గురుకుంట్ల రాకేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం సంస్మరణ సభ జరిగింది. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ హజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

●హుజూరాబాద్:పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, పాల్గొన్నారు.

●శంకరపట్నం: మొలంగూర్ జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీరజ పాల్గొన్నారు.

●హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. శాతవాహన జేసీ వ్యవస్థాపక చైర్మన్ చైతన్య దుప్పట్లను పంపిణీ చేశారు.